క్లుప్తంగా

టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


శిక్షణను పరిశీలిస్తున్న ఎస్‌ఓటూ జీఎం

రామగిరి: సింగరేణి యాజమాన్యం సేవా సమితి ఆధ్వర్యంలో ఇస్తున్న టైలరింగ్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ3 ఎస్‌ఓటూ జీఎం జి. రఘుపతి సూచించారు. టైలరింగ్ శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించి పరిశీలించారు. సింగరేణి సంస్థ ఆర్జీ– 3 ఓసీపీ–1, ఓసీపీ2 ప్రభావిత గ్రామం నాగేపల్లిలో ప్రాజెక్ట్ పర్యావరణ రెమిడేషన్ ప్లాన్‌లో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్ కోసం 60 మంది మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓదెలు, పర్యావరణ అధికారి ఎండీ. షఫీ, పర్సనల్ డీజీఎం విలాస్ శ్రీనివాస్ పోద్దార్, డీవైపీఎం కే. మారుతి తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలపై విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న ఎంఈవో సంపత్‌రావు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని కేజీఎస్ ఫంక్షన్‌హాల్లో పదో తరగతి విద్యార్థులకు పది పరీక్షలపై అవగాహన కల్పించారు. కమాన్‌పూర్, రొంపికుంట, జూలపల్లి జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులకు పరీక్షలకు ఎలా చదవాలి, ఎలా పరీక్షలు రాయాలి అనే అంశంపై ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, సైకాలజిస్ట్ అనిత మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈవో పల్లెపాటి సంపత్ రావు హాజరై మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదివి పరీక్షల సమయంలో భయం వీడితే విజయం సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌పై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

రామగిరి: మండలంలోని పన్నూరు పంచాయతీ పరిధిలోని శివరాంనగర్‌లో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో సోమవారం ఎస్సై కటికె రవిప్రసాద్ విద్యార్థినులకు ఈవ్‌టీజింగ్‌పై అవగాహన కల్పించారు. సమాజంలో జరుగుతున్న ఈవ్ టీజింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల్లో ఎవరికైనా ఏదైనా సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. మిమ్మల్ని ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే 100కి కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో మంజుల, విద్యార్థినులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం


పెరటి కోళ్లను అందిస్తున్న నాయకులు

జూలపల్లి: చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాకాలను వినియోగించుకోవాలని ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి సూచించారు. సోమవారం మండలంలోని కుమ్మరికుంట, తేలుకుంట గ్రామాల్లోని రైతులకు జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, ఎంపీపీ సబ్సిడీపై పెరటి కోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి అజారోద్దీన్, సర్పంచ్ సంతోశ్ రావు, ఎంపీటీసీ మల్లేశ్ యాదవ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆరు బుల్లెట్ బండ్లు సీజ్

పెద్దపల్లిరూరల్: రోడ్లపై తిరిగే వాహనాలు భారీ స్థాయిలో శబ్దాలు చేస్తే సదరు వాహనదారులపై చర్యలు తప్పవని పెద్దపల్లి ఎస్సై రాజేశ్ హెచ్చరించారు. పట్టణంలో సోమవారం చేపట్టిన వాహన తనిఖీల్లో ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా శబ్దాలు చేసేలా సైలెన్సర్లను అమర్చుకున్న ఆరు బుల్లెట్లను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కంపెనీ నుంచి వచ్చిన సైలెన్సర్లను తొలగించి అధిక శబ్దం చేసే సైలెన్సర్లను బిగించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

- నలుగురు ప్రజాప్రతినిధులు.. ఇరవై మంది అధికారులు
- గంట ఆలస్యంగా మొదలై.. గంటలో ముగింపు
- పాలనపై పట్టింపులేని పాలకులు, అధికారులు


సమావేశంలో ప్రగతి నివేదికను చదివి వినిపిస్తున్న మిషన్ భగీరథ ఏఈ


సమావేశానికి హాజరైన ఎంపీటీసీ సభ్యులు

పాలకుర్తి : గ్రామాల్లో ప్రజా సమస్యలను సభా దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారం కోసం కృషి చేయాల్సిన పాలకులు, అధికారుల నిర్లక్ష్యనానికి నిదర్శనం సోమవారం జరిగిన పాలకుర్తి మండల సర్వసభ్య సమావేశం. మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా కొనసాగింది. ముందుగా నిర్ణయించిన సమయానికంటే దాదాపు గంటపావు ఆలస్యంగా ప్రారంభమై... గంట వరకు మాత్రమే కొనసాగింది. సమావేశానికి హాజరైన అధికారులు తమ విభాగాల వారిగా తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించడంతో సమావేశం ముగిసింది. ప్రజాసమస్యలు చర్చించేందుకు పాలకులెవరు సమావేశానికి హాజరు కాకపోవడం విశేషం.

నలుగురు ఎంపీటీసీలు హాజరు

మండల వ్యాప్తంగా మొత్తం 19 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 11 మంది ఎంపీటీసీలు ఉండగా వారిలో ఇద్దరు ఎంపీటీసీలు అనర్హత వేటుకు గురికావడంతో 9మంది మాత్రమే ఉన్నారు. ఎంపీపీ అనసూర్య విదేశీ పర్యటనలో ఉండడంతో వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. షెడ్యూల్ ప్రకారం ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సింది. అయితే ఎంపీడీవో లేట్‌గా రావడంతో సమావేశం లేటైంది. సమావేశానికి ప్రజాప్రతినిధులు ఒక్కరూ కూడా హాజరుకాలేదు. దీంతో ఎంపీడీవో లలిత ఎంపీటీసీలకు ఫోన్లు చేసి సమావేశానికి రావాల్సిందిగా కోరారు. స్పందించిన కొత్తపల్లి, జీడీనగర్, పాలకుర్తి, ఈసాలతక్కళ్లపల్లి ఎంపీటీసీలు సమావేశానికి రావడంతో ఎంపీడీవో లలిత 12–10 నిలకు దాదాపు గంటపావు ఆలస్యంగా సమావేశాన్ని ప్రారంభించారు. కేవలం నలుగురు ప్రజాప్రతినిధులు, 20 మంది అధికారులు ఉన్నారు. పది నిమిషాల అనంతరం జీడీనగర్ ఎంపీటీసీ బండారి శ్రీవాణి సమావేశం నుండి వెళ్లిపోవడంతో కేవలం ముగ్గురు ప్రజాప్రతినిధులు మాత్రమే మిగిలారు. ఎంపీడీవో లలిత ఆదేశాల మేరకు వివిధ విభాగాలకు చెందిన అధికారులు తమ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ముఖ్యమైన శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. మిగతా 14 శాఖల అధికారులు మాత్రం తమ శాఖలకు సంబంధించిన అంశాలను చదివి వినిపించారు.

సర్పంచ్‌లు గైర్హాజరు..

మండల సర్వసభ్య సమావేశానికి మండల పరిధిలోని గ్రామాల సర్పంచ్‌లు ఎవరూ కూడా హాజరు కాలేదు. మొత్తం 19 మంది సర్పంచ్‌లు ఉండగా ఒక్క సర్పంచ్ కూడా సమావేశంలో పాల్గొనలేదు.

ఎందుకింత నిర్లక్ష్యం..

గ్రామాల్లో నెలకొన్న సమస్యల గురించి చర్చించి వాటిని పరిష్కరించుకునేందుకు గాను ప్రతి మూడు నెలలకొకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశానికి సభ్యులు హాజరుకాకపోవడంతో ప్రజా సమస్యలు చర్చించలేదు. ఇది ప్రజాప్రతినిధుల అవగాహన రాహిత్యమో లేక నిర్లక్ష్యమో తెలియదు గానీ ప్రతి సమావేశం ఇదే రీతిన కొనసాగుతోంది. సమావేశానికి కోరం సభ్యులు సకాలంలో హాజరుకాకపోవడం, అధికారులు వారిని బ్రతిమాలి సమావేశానికి రప్పించడం సమావేశం ప్రారంభం కాగానే పాలకులు వెళ్ళిపోవడం పరిపాటిగా మారింది. దీనికి తోడు అధికారులు కూడా పూర్తిస్థాయిలో హాజరుకావడం లేదు. ఇంత జరుగుతున్న ఉన్నతాధికారులెవరూ తగిన క్రమశిక్షణ చర్యలు చేపట్టకపోవడంతో అధికారులు, పాలకుల్లో జవాబుదారీతనం కొరవడిందనే అభిప్రాయం స్థానికంగా వ్యక్తమవుతోంది.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి


డిజిటల్ క్లాసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దాసరి

సుల్తానాబాద్‌రూరల్: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తోందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం కదంబాపూర్‌లోని (కాశిపల్లి), గర్రెపల్లి జెడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. కాశిపల్లి పాఠశాలలో కిచెన్ షెడ్డు, తరగతి గది, గర్రెపల్లిలో కమ్యూనిటీ హాల్, డిజిటల్ క్లాస్‌రూంలు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధితో పాటు పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించి విద్యార్థులకు ఉన్నత చదువులు అందించాలనే సీఎం కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా మన ఊరు–మన బడి కార్యక్రమం ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు వీరగొని సుజాత, ఎంపీపీ బాలాజీరావు, ఎంపీడీవో శశికళ, ఎంపీటీసీ పులి అనూష, హెచ్‌ఎంలు మాధవీలత, అనంతరెడ్డి, ఎంఈవో సురేందర్, ఎస్సారెస్పీ డీఈ మాధుమతి, ఏఈ ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కండి

సుల్తానాబాద్: అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆర్యవైశ్య భవనంలో ముఖ్య కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్న వారి భరతం పట్టాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తకు ఉందన్నారు. కార్యకర్త సైనికులుగా పనిచేస్తే రానున్న రోజుల్లో అధికారం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలాజీ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, మండల పార్టీ అధ్యక్షుడు పురం చందర్ రావు, ఏఎంసీ చైర్మన్ బుర్ర మౌనిక, నాయకులు కాదాసి చంద్రమౌళి, గొడుగుల సతీశ్, మహేందర్ బుర్ర శ్రీనివాస్ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు వీరగోని సుజాత, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఫకీర్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు గుణపతి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

యువత క్రీడా నైపుణ్యం పెంచుకోవాలి

కాల్వశ్రీరాంపూర్:యువ క్రీడాకారులు తమ నైపుణ్యం పెంచుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించాలని జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి అన్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో ఎండి రఫీ, చొప్పరి రవి స్మారకార్థం సోమవారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో నాంసానిపల్లె ఇదులాపూర్ జట్లమధ్య జరిగిన పోటీలో నాంసానిపల్లె జట్టు విజయం సాధించి ట్రోఫీతోపాటు, 10 వేల రూపాయిలు ప్రైజ్‌మనీ గెలుచుకున్నారు. రన్నర్‌గా నిలిచిన ఇదులాపూర్ టీం ఐదు వేల రూపాయిలు ప్రైజ్‌మనీ అందుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కరుణాకర్, సోషల్ మీడియా కన్వీనర్ ధర్మల రవి, క్రీడాకారులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

రామగిరి:ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్‌కు చెందిన పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన రత్న రాజమ్మకు మంజూరైన రూ 12వేలు, బైరి పెద్దమల్లయ్యకు రూ. 16,500, అల్లం రవీందర్‌కు రూ.15 వేల చెక్కులను అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దొడ్డ గీతారాణి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, నాయకులు పాల్గొన్నారు.

దుమ్ముతో వేగలేకపోతున్నం


రాస్తారోకో చేస్తున్న వ్యాపారులు

సుల్తానాబాద్: ఓవర్ లోడ్ లారీల దుమ్ముతో వేగలేకతున్నామని మండల కేంద్రంలో సోమవారం అంబేద్కర్ చౌరస్తా సమీపంలో వ్యాపారులు రాస్తారోకో చేపట్టారు. మానేరువాగు నుంచి ఇసుకను తరలించొద్దని చెప్పినప్పటికీ నిబంధనలు ఉల్లంఘించి రాత్రి వేళల్లో ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. అధికారులు సైతం అటువైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. సుల్తానాబాద్‌లో వ్యాపారమంతా ఒక కూడలిలోనే జరుగుతుందని, ఆ కూడలిలో దుమ్ము ధూళి చెలరేగడంతో షట్టర్లను మూసుకునే పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇప్పటికే దుకాణాలు నడవక కిరాయిలు కట్టలేని పరిస్థితి నెలకొందని, అధికారులకు, మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదన్నారు. దుమ్ముతో శ్వాసకోశ వ్యాధులతో పాటు ఊపిరితిత్తుల సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్ల వెంబడి నిత్యం క్యూరింగ్ చేయాల్సి ఉండగా, కాంట్రాక్టర్ వారం రోజులుగా క్యూరింగ్ చేయడం లేదని తెలిపారు. పోలీసులు రాస్తారోకోను విరమింపజేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు. కార్యక్రమంలో వ్యాపారులు సంతోశ్, నగేశ్, వీర శ్రీనివాస్, మల్లారెడ్డి, రఫిక్, నయీం, బండి రామ్మోహన్, మధు, వ్యాపారులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడిగా రాజయ్య


రాపెల్లి రాజయ్య

ఓదెల: మల్లికార్జునస్వామి మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడిగా రాపెల్లి రాజయ్య ఎన్నికయ్యారు. సోమవారం ఓదెలలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షపదవికి ఇద్దరు పోటీపడగా రాజయ్య గెలుపొందారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఆశంశెట్టి వెంకటేశ్, తోట తిరుపతి, బీరం రాజేందర్, తిరుపతి, తొట కమలాకర్, పాల్గొన్నారు.


చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఓదెల: మండల కేంద్రానికి చెందిన గోపతి మల్లయ్య(67) అనే వృద్ధుడు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందాడు. పొత్కపల్లి ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. ఓదెల గ్రామానికి చెందిన ఎసింగరేణి రిటైర్డ్ ఉద్యోగి గోపతి మల్లయ్య అనారోగ్య సమస్యలతో ఆదివారం పురుగుల మందుతాగగా చికిత్సకోసం సుల్తానాబాద్‌కు తరలించారు. పరిస్థితి విషమించి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించగా, చికిత్సపొందుతూ సోమవారం మల్లయ్య మృతి చెందగా, మృతురాలి భార్య గోపతి మొండవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నేటితో ముగియనున్న అభ్యంతరాల స్వీకరణ

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని అంతర్గాం, టీటీఎస్ అంతర్గాం, గోలివాడ గ్రామాల్లోని డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ గడువు నేటితో ముగియనుందని అంతర్గాం తహసీల్దార్ కత్రోజు వేణుగోపాల్ తెలిపారు. దరఖాస్తుల ఆధారంగా అధికారులు క్షేత్ర సర్వే చేపట్టి 392 మందితో తుది జాబితాను రూపొందించి వారి పేర్లను కార్యాలయం ఎదుట ప్రదర్శనగా ఉంచారు. జాబితాలో అనర్హులు ఎవరైనా ఉంటే తమకు ఫిర్యాదు చేస్తే వారిపై మరోసారి క్షేత్రస్థాయి సర్వే చేపడతామని, ఫిర్యాదు చేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తహసీల్దార్ పేర్కొన్నారు. రామగుండం మండల పరిధిలో 620 డబుల్ బెడ్ రూం గృహాలు సిద్ధం కాగా 7,672 దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తుల ఆధారంగా క్షేత్ర పరిశీలన చేపట్టి 2,380 మంది లబ్ధిదారులుగా గుర్తించినట్లు రామగుండం తహశీల్దార్ జాహెద్‌పాషా తెలిపారు. తాము అర్హులుగా గుర్తించిన జాబితాను కార్యాలయంలో ఉంచామని, జాబితాలో పేర్కొన్న అభ్యర్థులపై ఈనెల 10వ తేదీలోగా అభ్యంతరాలను స్వీకరించిన మీదట తుది జాబితా సిద్ధం చేశామన్నారు. ఈనెల 16న గోదావరిఖని జీఎం కార్యాలయంలో లక్కీ డ్రా విధానంతో లబ్ధిదారులను ఎంపిక చేస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.

ట్యాంకర్‌తో నీటి సరఫరా


నీరు పడుతున్న కౌన్సిలర్

సుల్తానాబాద్: మూడు రోజులుగా పట్టణంలోని 3వ వార్డులో రక్షిత మంచినీరు రాకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేసినట్లు కౌన్సిలర్ నిషాద్ రఫిక్ తెలిపారు. ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు కలవకుండా ఉండేందుకు నీటిని సరఫరా చేసినట్లు తెలిపారు. వేసవికాలం రాకముందే నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. దీనిపై మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత వివరణ కోరగా నేటినుంచి నీటిని సరఫరా చేస్తామని తెలిపారు.

ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు


ముత్తారంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గ కేంద్రాలు, గోదావరిఖని, సుల్తానాబాద్ పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో కవిత జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు కేక్‌లు కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్న ఎమ్మెల్సీ కవిత ఆదర్శమని నాయకులు కొనియాడారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్

అంగరంగ వైభవంగా దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ఠ


హోమంలో పాల్గొన్న గ్రామస్తులు

రామగిరి:మండలంలోని బుధవారంపేట(రామయ్యపల్లి)లోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయ 17వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా నిర్వహించారు. రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న దత్తాత్రేయ నూతన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో భాగంగా గణపతి హోమం, రుద్రాభిషేకం జలాభిషేకం, నవగ్రహ ప్రతిష్ఠాపన, దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, మంథని మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ, ఎంపీపీ అరెల్లి దేవక్క, సర్పంచ్ దేవునూరి రజిత, శ్రీనివాస్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

17న ధ్వజస్తంభ స్థాపన

రామగిరి: ముత్తారం మండలం లక్కారంలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ ధ్వజస్తంభ స్థాపన ఈనెల 17 న నిర్వహించనున్నట్లు కోదండ రామాలయ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక పూజల్లో భాగంగా ఈనెల 15 ఉదయం 9 గంటలకు అఖండ దీపారాధన, అంకురార్పణ, యాగశాల ప్రవేశం, ద్వారతోరణ పూజ, అగ్నిప్రతిష్ఠ, సాయంత్రం 5.30 గంటలకు ఆరాధనలు, ఆవాహిత దేవతా హోమాలు, మూల మంత్ర హోమాలు, 16న ఉదయం 9 గంటలకు స్థాపితాదేవత పూజలు, హోమాలు, మంగళశాసనములు, 17న ఉదయం 5 గంటలకు గర్తరి పూజ, 7.55 గంటలకు యంత్రమూర్తి స్థాపనం, దిష్టి కుంభం, శాంతికల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలకు సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శాత్రాజ్‌పల్లిని ముత్తారంలోనే కొనసాగించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

రామగిరి: ముత్తారం మండలం పారుపెల్లి పరిధిలోని శాత్రాజ్‌పల్లిని ముత్తారం మండలంలోనే కొనసాగించాలని గ్రామస్తులు, రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ వరంధన్ వినతిపత్రం అందించి మాట్లాడారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెంకట్రావ్‌పల్లి పంచాయతీలో శాత్రాజ్‌పల్లిని కలిపేందుకు తమకు ఇష్టం లేదని, తమ గ్రామశివారులో ఉన్న ప్రభుత్వ భూమిపై కన్నేసిన కొంతమంది దళారులు శాత్రాజ్‌పల్లిని వెంకట్రావ్‌పల్లి పంచాయతీలో విలీనం చేస్తే భూములను స్వాహా చేయవచ్చుననే కుట్ర చేస్తున్నారని వారు వివరించారు. వెంకట్రావ్‌పల్లిలో విలీనం చేస్తే చాలా మంది రైతులు ఇబ్బందులు పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల, గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని శాత్రాజ్‌పల్లి ముత్తారం మండలంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

'బలగం' నటికి సన్మానం


సుజాతను సన్మానిస్తున్న జెడ్పీటీసీ

కోల్‌సిటీ: బలగం చిత్రంలో హీరోకు తల్లిగా నటించిన గోదావరిఖని కోల్‌బెల్ట్ ఏరియాకు చెందిన నటి కొమ్ము సుజాతను సోమవారం కేఎస్‌ఆర్, ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ ఆధ్వర్యంలో పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో సినీ పరిశ్రమలో పేరు సంపాదించడం అంత సులువు కాదనేది బహిరంగ సత్యమేనన్నారు. ఈ ప్రాంత ఆడపడుచు సుజాత సీరియల్, సినిమాలు, క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేస్తూ అంచెలంచెలుగా ఎదుగుతున్నారన్నారు. సుజాత చిత్రపరిశ్రమలో మరింత అభివృద్ధి చెంది రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి వన్నె తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మద్దెల దినేశ్, రేణికుంట్ల నరేందర్, గడప శ్రీకాంత్, కొమ్ము చందు, రాజేశ్, ప్రశాంత్, మండల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఆదేశాలు పకడ్బందీగా అమలు చేయాలి


మాట్లాడుతున్న రాజేశ్

ధర్మారం: పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిష్టానం ఆదేశాలను పకడ్బందీగా అమలు చేయాలని స్వచ్ఛ భారత్ రాష్ట్ర కన్వీనర్ మంచె రాజేశ్ సూచించారు. ధర్మారం మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్‌లో సోమవారం నిర్వహించిన భూత్ సశక్తికరణ అభియాన్ కార్యక్రమానికి మంచె రాజేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే రోజుల్లో శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు, విస్తరక్‌లు, బూత్ కమిటీల అధ్యక్షులు చేపట్టబోయే బాధ్యతల గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు యాళ్ళ తిరుపతిరెడ్డి దళితమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కాడే సూర్యనారాయణ, బీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మెడవేని శ్రీనివాస్, మండల పార్టీ ప్రధానకార్యదర్శి సందినేని లక్ష్మణ్, మండల కో–ఆర్డినేటర్ తీగుళ్ళ సతీశ్‌రెడ్డి, తదితరులుపాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సీఎల్‌సీ కార్యాలయం వద్ద సీఐటీయూ ధర్నా

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం హైదరాబాద్‌లోని సీఎల్‌సీ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. కాంట్రాక్టు కార్మికుల గత ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎల్‌సీ శ్రీనివాస్ మాట్లాడుతూ నెలరోజుల్లోగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బి.మధు, సమ్మయ్య, శ్రీనివాస్, సతీశ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రంగోళి, మెహందీ పోటీలు

కోల్‌సిటీ: మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా సోమవారం మెప్మా ఆధ్వర్యంలో స్వశక్తి మహిళలకు రంగోళి, మెహందీ పోటీలు నిర్వహించారు. స్వశక్తి మహిళలు ఉత్సాహంగా పాల్గొన్న రంగోళి వేసిన ముగ్గులను, మెహందీలను నగర పాలక కమిషనర్ సుమన్‌రావు పరిశీలించి అభినందించారు. వారోత్సవాల ముగింపు రోజు విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సూపరింటెండెంట్ మనోహర్‌రెడ్డి, మెప్మా ప్రతినిధి శ్వేత తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల విధుల బహిష్కరణ

ఓదెల: గ్రామపంచాయతీ కార్మికులకు జీతాలు రాకపవడంతో కామారెడ్డి జిల్లా బీబీనగర్ గ్రామపంచాయతీ కార్మికుడు బాబు ఉరేసుకుని మృతి చెందగా, మండలంలోని గుంపుల గ్రామపంచాయతీ కార్యాలయంలో కార్మికులు సోమవారం విధులు బహిష్కరించారు. ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బాబు మృతికి సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో కారోబార్ కర్రు సుదర్శన్, సిబ్బంది సదానందం, శ్రీనివాస్, సదయ్య, పాల్గొన్నారు.

ఘనంగా ల్యాబ్ టెక్నీషియన్స్ డే

కోల్‌సిటీ: రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో సోమవారం ల్యాబ్ టెక్నీషియన్స్ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్స్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరిపారు. రోగ నిర్ధారణలో ల్యాబ్ టెక్నీషియన్స్ పాత్ర కీలకమన్నారు. అనేక ప్రాణాంతకమైన వ్యాధులను నిర్ధారించడానికి ల్యాబ్ టెక్నీషియన్స్ కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్స్ ఇమ్మిడిశెట్టి శివ, సంపత్, కమల్, ప్రకాష్, మల్లారెడ్డి, స్వప్న, స్వచ్ఛ, అన్వర్ పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర కరాటే పోటీల్లో ప్రతిభ

మంథని: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో నిర్వహించిన అంతర్ రాష్ట్ర కరాటే పోటీల్లో మంథని విద్యార్థులు ప్రతిభ కనబర్చి బంగారు, వెండి పతకాలు సాధించినట్లు కరాటే శిక్షకులు కావేటి సమ్మయ్య తెలిపారు. మెట్టు హాసిని, అశ్వినిబాబు, మణిప్రియ, చాందిని,సిందుజ, మనోజ్ఞ, వైష్ణవి, సింధు, వర్షిణీ, శ్రీనిధి పతకాలు సాధించినట్లు తెలిపారు.